సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



సాగర్ వద్ద రోడ్డు ప్రమాదం

నాగార్జునసాగర్‌ను చూసేందుకు వచ్చిన ఓ మహిళా కానిస్టేబుల్ దుర్మరణం చెందగా ఒకరికి గాయాలయ్యాయి. - 8లో



కేంద్ర నిధులతోనే అభివృద్ధి

కేంద్రం ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు పేర్కొన్నారు. - 9లో



సమస్యల పరిష్కారానికి కృషి

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు పాండు అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్ష

సాక్షి,యాదాద్రి : జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని కమిటీ సభ్యులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జైపాల్‌రెడ్డి, ఏసీపీలు రవికిరణ్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు ప్రతిష్ఠామూర్తులకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవారిని నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చించారు. అలాగే ఆలయ ముఖమండపం, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

ధరణి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయొద్దు



ఫిర్యాదులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మోత్కూరు : ధరణి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ ఆదేశించారు. బుధవారం మోత్కూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ధరణి పోర్టల్‌తో పాటు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై ధరణి ఫిర్యాదులపై సమీక్షించారు. పాత కేసులు ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐలు దాసరి శ్రీనివాస్, సుమన్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు మర్యాల విద్యార్థి



దీపికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొమ్మలరామారం : హైదరాబాద్‌లో ఈనెల 19,20వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ క్రీడా పోటీలకు బొమ్మలరామారం మండలంలోని మర్యాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ధరావత్ దీపిక ఎంపికైంది. ఇటీవల భువనగిరిలో నిర్వహించిన జిల్లాస్థాయి దీపిక ఉత్తమ ప్రతభ కనబరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీపికను హెచ్‌ఎం నిర్మలజ్యోతి, ఉపాధ్యాయులు, శ్రీకాంత్, స్వరూప, రాణి, సిద్దులు,రాజు ముఖీద్,రవీశ్వర్ సుజాత, శ్రీధర్, నాగజ్యోతి, శ్రీదేవి, గోపాల్, సుష్మ పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తాం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను గౌరవిస్తామని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌కు వెళతామని తెలిపారు. అవసరమైతే సుప్రీం కోర్టును కూడా ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ కార్యాలయాలకు కూడా అనుమతి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. పార్టీ కార్యాలయాన్ని కూలిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చడమే పనిగా పెట్టుకుందని.. అలా కాకుండా నిలబెట్టడం నేర్చుకోవాలని హితవు పలికారు.

'రీజినల్' అలైన్‌మెంట్ మార్చాల్సిందే

భువనగిరి, చౌటుప్పల్‌ను రెండుగా చీల్చొద్దు

- చౌక భూములను కాదని విలువైన భూముల కొనుగోలు ఎందుకు?
- రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంపై అభ్యంతరాలు
- అలైన్‌మెంట్ మార్పుకోసం పట్టుబడుతున్న భూ నిర్వాసితులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చౌటుప్పల్ రైతులు, మద్దతు ప్రకటించి మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, చిత్రంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

సాక్షి, యాదాద్రి : రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణకు అధికారులు సిద్ధమవుతున్న తరుణంలో బాధితుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా భువనగిరి, చౌటుప్పల్ మున్సిపాలిటీలు రెండుగా చీలుపోనుండడంతో హైవే అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్లాన్ ప్రకారం సామాన్య, మధ్య తరగతి ప్రజలు అధికంగా నష్టపోతున్నందున అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని, పరిహారంపై తేల్చాకే భూసేకరణ చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.

పరిహారం చెల్లింపునకు సిద్ధం

తుర్కపల్లి, యాదగిరిగుట్ట, వలిగొండ, చౌటుప్పల్ మండలాల పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు భూ బాధితులకు పరిహారం చెల్లింపునకు అధికారులు సిద్ధమవుతున్నారు. తుర్కపల్లి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లోని వ్యవసాయ భూములకు, చౌటుప్పల్, యాదగిరిగుట్ట మండలాల పరిధిలోని ఓపెన్ ప్లాట్లకు 2013 భూసేకరణచట్టం ప్రకారం రెవెన్యూ అధికారులు ధరలు నిర్ణయించి జాతీయ రహదారి సంస్థకు పంపినట్లు తెలుస్తోంది. రాయగిరితోపాటు భువనగిరి మండలంలోని పలు గ్రామాలకు సంబంధించి హైకోర్టులో కేసు ఉన్నందున ఇక్కడి భూములకు ధర నిర్ణయించలేదు.

మారిన అలైన్‌మెంట్ ఇలా..

ఔటర్ రింగ్‌రోడ్డుకు 40 కిలో మీటర్ల దూరంలో రీజినల్ రింగ్‌రోడ్డు ఉండాలనేది నిబంధన.కానీ, చౌటుప్పల్, రాయగిరి పరిధిలో నిబంధనలు తుంగలో తొక్కారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలు పెద్ద ఎత్తున భూములు, ప్లాట్లు, ఇళ్లు కోల్పోవాల్సి వస్తుంది. తొలుత నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి నుంచి రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేయాలని బావించారు. ఆ తర్వాత ప్లాన్ మార్చి చౌటుప్పల్ మండలం జిల్లేడుచెల్క వద్ద నుంచి నిర్మాణం చేసేందుకు నిర్ణయించారు. అయితే చౌటుప్పల్ పరిధిలో ఉన్న రెండు ప్రధాన రసాయన పరిశ్రమలు రీజినల్ రింగ్ రోడ్డు లోపలి భాగంలోకి వస్తున్నాయి. దీంతో ఆయా పరిశ్రమల యాజమాన్యాలు తమ పలుకుబడి ఉపయోగించి అలైన్‌మెంట్ మార్చుకున్నారని ఆరోపణలున్నాయి. దీంతో మరోసారి అలైన్‌మెంట్ మార్చి చౌటుప్పల్ పట్టణం మధ్యగా రోడ్డు వేస్తున్నారు. తద్వారా చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండుగా చీలిపోనుంది. పట్టణ శివారులో నిర్మిస్తున్న జంక్షన్ కారణంగా ఉత్తరంలో చౌటుప్పల్, తాళ్లసింగారం, దక్షిణంలో చౌటుప్పల్, తంగడపల్లి గ్రామాలు విభజనకు గురికానున్నాయి. అదే విధంగా తూర్పున లింగోజిగూడెం సపరేటుగా మారనుంది. పడమర దిశలో చౌటుప్పల్ పట్టణం ఒక్కటే మిగిలిపోనుంది.ప్రస్తుతం నిర్ణయించిన జంక్షన్ వద్ద తూర్పు భాగాన ప్రభుత్వ, గోల్డెన్‌ఫారెస్ట్ భూములు అందుబాటులో ఉన్నా పరిశ్రమ కోసం పడమర వైపు భూసేకరణ చేస్తున్నారు. ఒక వేళ తూర్పువైపు మారిస్తే చాలామందికి ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వానికి భూసేకరణ వ్యయం తగ్గుతుంది.

రాయగిరి రైతులదీ అదే పరిస్థితి

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ముందుగా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి, రాజాపేట మండలం బేగంపేట, చల్లూరు, యాదగిరిగుట్ట మండలం సైదాపురం, వంగపల్లి, మోటకొండూరు, భువనగిరి మండలం బండసోమారం మీదుగా వలిగొండ, చౌటుప్పల్ మండలం వరకు ప్రతిపాదించారు. వంగపల్లి వద్ద హైవేపై జంక్షన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇది ఔటర్‌కు 35 కిలో మీటర్ల దూరం ఉంది. అయితే మార్చిన అలైన్‌మెంట్ ప్రకారం గుట్ట మండలం మల్లాపురం నుంచి భువనగిరి మున్సిపాలిటీ రెండుగా చీలిపోనుంది. రాయగిరి రైతులు పెద్ద ఎత్తున భూములు నష్టపోవాల్సి వస్తుంది.

మార్కెట్ ధర చెల్లించాలి

భువనగిరిటౌన్ : చౌటుప్పల్ మండల పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చడంతో పాటు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట చౌటుప్పల్ మండల పరిధిలోని రైతులు నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డును ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 28 కిలో మీటర్ల దూరంలోనే నిర్మించడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. రీజనల్ రింగ్ రోడ్డుకు తాము వ్యతిరేకం కాదని, అయితే బాధిత రైతులకు భూమికి భూమి లేదా, మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో రైతు ఐక్య వేదిక నాయకులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గంగదేవి సైదులు, బండారు నరసింహ, ఢిల్లీ మాధవరెడ్డి, పొట్ట శ్రీను, పెద్దింటి బుచ్చిరెడ్డి, కొండే శ్రీశైలం, లింగం, నరసింహ, మంద నిర్మల, మంద భారతమ్మ, మామిడి నిర్మల, వల్లూరి పద్మ, జాల బుచ్చమ్మ పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు



ఔటర్ రింగ్ రోడ్డుకు 42 కిలో మీటర్ల దూరం నుంచి రిజినల్ రింగ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. కానీ, 28 కిలో మీటర్ల దూరంలోనే నిర్మిస్తున్నారు. దీని వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండుగా చీలిపోతుంది. ఆర్‌అండ్‌బీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు ఎందుకు పట్టించుకోవడం లేదు. ముందుగా రూపొందించిన ఆలైన్‌మెంట్ ప్రకారం తక్కువ ధరకు భూములు లభిస్తాయి. పెద్దల ప్రయోజనాల కోసం పేద రైతుల భూములు తీసుకోవద్దు. అలైన్‌మెంట్ మార్చాలి. –కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మునుగోడు

నిర్వాసితులకు అన్యాయం చేయొద్దు



చౌటుప్పల్ మండల పరిధిలో రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి. మార్కెట్ ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి. చౌటుప్పల్ మండల పరిధిలో ఎకరం రూ.2 కోట్లు, చౌటుప్పల్ పట్టణ పరిధిలో రూ.4కోట్లు ఉంటే రూ.లక్షల్లో పరిహారం ఇస్తామనడం సరికాదు. భూమికి బదులు భూమి ఇవ్వాలి. భూములు కోల్పోతున్న కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. నిర్వాసితులకు అన్యాయం చేయొద్దు. –జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

రైతుల సంక్షేమమే ధ్యేయం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



లింగాల భిక్షంగౌడ్‌కు చెక్కు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

గుండాల : రైతుల సంక్షేమమే ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతుల రుణాల కోసం గుండాల పీఏసీఎస్‌కు కోటి రూపాయలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా రైతులందరికీ రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు ద్యాప కృష్ణారెడ్డి, నూనెముంతల వెంకటేశ్వర్లు, కోలుకొండ యాదగిరి పాల్గొన్నారు.

పెద్దచెరువు శుద్ధి

భువనగిరిటౌన్ : వినాయక నిమజ్జనం సందర్భంగా భువనగిరి పెద్ద చెరువులో పెద్ద ఎత్తున చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను, వాటర్ బాటిళ్లు, పూల దండలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, హెల్త్ అసిస్టెంట్ రజిత సిబ్బంది పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇల్లిక్కడ.. ఓటక్కడ!

ఒకే కుటుంబంలోని ఓట్లు చెల్లాచెదురు

- వేర్వేరు వార్డుల్లో నమోదు
- గందరగోళంగా పంచాయతీ ఓటరు ముసాయిదా జాబితా
- ప్రజల నుంచి అభ్యంతరాలు
- సరిదిద్దే ప్రయత్నంలో అధికారులు



నాలుగో వార్డులో ఇల్లుండి 8వ వార్డులో నమోదైన ఓటర్లు

రామన్నపేట : ఒకే కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండాలి. అవి కూడా వరుస క్రమంలోనే ఉండాలి. కానీ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన పంచాయతీ ఓటరు జాబితా ముసాయిదా అస్తవ్యస్తంగా ఉంది. రామన్నపేట మేజర్ గ్రామ పంచాయతీలో ఒకే కుటుంబంలోని ఓట్లన్నీ చెల్లాచెదురయ్యాయి. వేర్వేరు వార్డుల్లో చేర్చడంతో గందరగోళం నెలకొంది. బాధిత ఓటర్ల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవడంతో సరిదిద్దే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

వార్డులు, ఓటర్లు, పోలింగ్ స్టేషన్లు ఇలా..

రామన్నపేట మేజర్ గ్రామ పంచాయతీలో 14 వార్డులు, ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం పది (30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 39) పోలింగ్ స్టేషన్లు, 6,763 మంది ఓటర్లు ఉన్నారు. ఒక్కో వార్డుకు సరాసరి 485 చొప్పున ఓట్లను కేటాయించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు గాను అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాను అనుసరించి ఇంటి నంబర్ల ప్రకారంగా ఒక కుటుంబానికి చెందిన ఓట్లను ఒకే వార్డులో ఉండే విధంగా సర్దుబాటు చేసి మొత్తం ఓట్లను అన్ని వార్డులకు సమానంగా కేటాయించాలి. ఈనెల 13న విడుదల చేసిన రామన్నపేటకు చెందిన ఓటరు ముసాయిదా జాబితాలో చాలా గందరగోళం నెలకొంది.

అభ్యంతరాల వెల్లువ

రామన్నపేట గ్రామ పంచాయతీ ఓటరు ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కుంటుంబంలోని ఓట్లను విడగొట్టి సంబంధంలేని వార్డుల్లో ఎలా వేస్తారంటూ బాధిత కుటుంబాలు అధికారులను నిలదీస్తున్నారు. అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చిన దరఖాస్తులను విచారణ చేసి జాబితాను సరిదిద్దే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మండల స్థాయిలో ఈనెల 19న జరిగే రాజకీయ పార్టీల నాయకులతో జరిగే సమావేశంలో మరిన్ని అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉంది. గత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలోనూ ఇదే రకమైన తప్పులు జరిగాయి. పోటీచేసిన అభ్యర్థులతోపాటు ఓటర్లు చాలా ఇబ్బంది పడ్డారు. గత ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఒకే కుటుంబం ఓట్లు వేర్వేరు ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఉండడం వల్ల అభ్యర్థులు ఓటర్లను కలవలేకపోయారు. కొంతమంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోలేకపోయారు.

పరిశీలిస్తున్నాం

ప్రజలు, వివిధ పార్టీల నాయకుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నాం. ఎడిట్ ఆప్షన్ ఉన్నందున సరి చేస్తున్నాం. ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. 28న తుది జాబితా ప్రకటిస్తారు. ఆలోగా పొరపాట్లను సరిచేస్తాం. ఆందోళన చెందవద్దు. ఎన్నికల నిబంధనల ప్రకారమే ఓటర్ల తుది జాబితా ఉంటుంది.
– ఖదీర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, రామన్నపేట

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

భువనగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి రిజర్వేషన్లు ఇంకా తేల్చకపోయినప్పటికీ ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా ఈనెల 13న ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేసింది. జాబితాలను జిల్లాలోని 426 గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. వీటిపై చర్చించేందుకు గురువారం అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశం కానున్నారు. ఇప్పటికే ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. 28వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 5,20,297 ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 2,59,167, మహిళలు 2,61,127 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు.

వివిధ వార్డుల్లో..

పదో వార్డుకు చెందిన ఓ కుటుంబంలో తల్లి ఓటు అదే వార్డులో ఉండగా, కుమారుల ఓట్లు 14వ వార్డులో చేర్చారు. అదే వార్డులోని మరో కుటుంబంలో భార్య ఓటు పదో వార్డులో ఉండగా భర్త, కుమారుల ఓట్లు 12వ వార్డులో ఉన్నాయి. ఒక్క 10వ వార్డుకు సంబంధించిన ఓటర్లలో జాబితాలోనే 15పైగా కుటుంబాల ఓట్లు వేర్వేరు వార్డుల్లో ఉన్నాయి. 5వ వార్డులోని కొన్ని ఓట్లను 2వ వార్డులో చేర్చారు. గతంలో 13, 14 వార్డుల్లో ఉండే ఓట్లను 11, 12, 13, 14వ వార్డుల్లో చేర్చారు. 9, 10, 11, 12, 14 వార్డుల్లో ఎక్కువ పొరపాట్లు జరిగాయని వివిధ పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. జాబితాలో చోటు చేసుకున్న తప్పులపై నేడు జరిగే సమావేశంలో అధికారులను ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు.

వార్డుకో ఓటు చీలిపోయింది



మా ఇంటి నంబర్ 6.110/1. మా కుటుంబం ఓట్లు గతంలో తొమ్మిదవ వార్డులో ఉండేవి. కొత్త జాబితాలో ఒక్కో ఓటును ఒక్కో వార్డులో వేశారు. నా ఓటు 8వ వార్డులో, మా నాన్న ఓటు 10వ వార్డులో, నా సోదరి ఓటు 6వ వార్డులో, మా తమ్ముడి ఓటు 2వ వార్డులో ఉంది. చాలా కుటుంబాల్లో ఇదే పరిస్థితి. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశాం.
–చెరుకు ఉపేందర్, రామన్నపేట

జాబితాను సవరించాలి



ఓటరు జాబితా గందరగోళంగా ఉన్నది. ఓట్ల సంఖ్య ఎక్కువ, తక్కువగా ఉన్నప్పుడు పక్క వార్డులోకి వేయడం సహజం. కానీ, ఇక్కడ సంబంధం లేని వార్డుల్లో కలిపారు. ఒకే కుటుంబం, ఒకే ఇంటి నంబర్ గల ఓట్లను సైతం వేర్వేరు వార్డుల్లో వేయడంతో గందరగోళంగా మారింది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
–ఎండీ రెహాన్, తాజామాజీ ఎంపీటీసీ, రామన్నపేట

ఓటరు జాబితా పారదర్శకంగా తయారు చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



యూసుఫ్‌నగర్‌లో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : ఓటరు జాబితా పక్కాగా పారదర్శకంగా రూపొందించాలని, ప్రతి ఇంటిని సర్వే చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఓటరు జాబితా సవరణపై కలెక్టరు హనుమంత్ కే.జెండగే, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లతో మండలాల వారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లకు ఇంటింటి సర్వే, ఓటరు జాబితా సవరణపై, యాప్ వినియోగంపై, ఫామ్ 6, 7, 8 నిర్వహణ పట్ల శిక్షణ ఇవ్వాలన్నారు. ఇంటింటి సర్వేకు ఇప్పుడు మంచి అవకాశం, వెసులుబాటు ఉందన్నారు. సర్వేలో కుటుంబాల వివరాలు, అడ్రస్సులు సరిగా పరిశీలించాలని, ఫొటోలు, అడ్రసులను, తప్పులున్న చోట సరిచేయాలని సూచించారు. దెబ్బతిన్న పోలింగ్ కేంద్రాల స్థానంలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు నిబంధనలను పాటించాలని, కుటుంబ సభ్యుల నుంచి మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలని తెలిపారు. బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించేలా రాజకీయ పార్టీలకు లేఖలు రాయాలని, డ్రాఫ్ట్ ఎలక్టోరల్ జాబితాలను వారికి ఇవ్వాలని తెలిపారు. క్రమం తప్పకుండా ఈవీఎం గోదాములను, రిజిస్టర్ల నిర్వహణను తనిఖీ చేయాలని తెలియచేశారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయసు నిండబోయే ప్రతి ఒక్కరిని ముందస్తుగానే గుర్తించి ఓటరు నమోదు చేపట్టాలని తెలిపారు. అనంతరం భువనగిరి పట్టణంలోని 52వ నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని, రాయగిరి 49, 50 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

ప్రశ్నలు వేసి.. పాఠాలు బోధించి

- తూప్రాన్‌పేట గురుకులం, జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్
- చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు సూచన



టెన్త్ విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న కలెక్టర్

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని తూప్రాన్‌పేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను బుధవారం కలెక్టర్ హనుమంతు కే.జెండగే తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పదో తరగతికి వెళ్లారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఫిజిక్స్ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆ తరువాత సాంఘిక శాస్త్రం బోధించారు. చదువుకుంటేనే భవిష్యత్ బాగుంటుందని, వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే హాస్టల్‌పై వసతులపై ఆరా తీశారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహించవద్దని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం అందజేయాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ కవిత, వైస్ ప్రిన్సిపాల్ సునీల, అధ్యాపకులు ఉన్నారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత



స్వచ్ఛతపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భువనగిరిటౌన్ : స్వచ్ఛత హీ సేవలో భాగంగా బుధవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని పలు విద్యా సంస్థల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛతపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామంజులరెడ్డి మాట్లాడుతూ.. భువనగిరిని చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పట్టణం మనదనే భావన కలిగిఉంటే అపరిశుభ్రత ఉండదన్నారు. అలాగే చెత్త సేకరణ వాహనాలకు జియో ట్యాగింగ్ చేశారు.

ఆహ్లాదం.. సంధ్యా సమయం



భూదాన్‌పోచంపల్లి చెరువు తీరంలో బుధవారం సంధ్యా సమయం కనువిందు చేసింది. నిండుకుండలా చెరువు, పైన నీలి మేఘాలు, అరుణవర్ణం పులుముకున్న భానుడు పశ్చిమాన వాలిపోతూ సరికొత్త అనుభూతిని పంచాడు. -భూదాన్‌పోచంపల్లి

సాగర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



లారీ కింద నుజ్జునుజ్జయిన కార్లు



శ్రావణి మృతదేహం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రశాంత్

- దయ్యాల గండి సమీపంలో కారును ఢీకొట్టిన సిమెంట్ లారీ
- మహిళా కానిస్టేబుల్ దుర్మరణం
- ఆమెకు కాబోయే జీవిత భాగస్వామికి గాయాలు

నాగార్జునసాగర్: సాగర్‌ను చూస్తానని వచ్చి ఓ మహిళా కానిస్టేబుల్ దుర్మరణం చెందగా, ఆమెకు కాబోయే జీవిత భాగస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లాలోని హైదరాబాద్–నాగార్జునసాగర్ హైవేపై దయ్యాల గండి వద్ద బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చేపల శ్రావణి(27)కి టాటా కంపెనీలో పనిచేస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన జి. ప్రశాంత్‌తో ఇటీవలనే ఎంగేజ్‌మెంట్ అయ్యింది. వీరికి నవంబర్‌లో వివాహం కావాల్సి ఉంది. ప్రశాంత్ కంపెనీ పనిమీద హాలియాకు రావాల్సి ఉండగా.. గద్వాల నుంచి ఇరువురు కారులో బయల్దేరారు. మార్గమధ్యలో శ్రావణి కోరిక మేరకు సాగర్‌ను సందర్శించి తిరిగి హాలియాకు వెళ్తున్నారు.

అప్పటికే రెండు కార్లు ఢీకొని..

ప్రశాంత్ కారు దయ్యాల గండి మూలమలుపు వద్దకు చేరుకోగానే అప్పటికే అక్కడ రెండు కార్లు ఒకదానికి ఒకటి స్వల్పంగా ఢీకొనడంతో ఆయా వాహనాల డ్రైవర్లు తగువుపడుతున్నారు. దీంతో హైవేకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రశాంత్ కారు కూడా ప్రమాదం జరిగిన రెండు కార్ల వెనక నిలిచిపోయింది. ప్రశాంత్ కారు వెనుక కూడా మరో కారు ఉంది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల నుంచి హైదరాబాద్‌కు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి తొలుత ప్రశాంత్ వెనుక ఉన్న కారును స్వల్పంగా ఢీకొట్టగా అది పక్కకు తొలగిపోయింది. అనంతరం లారీ ప్రశాంత్ కారును వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ ప్రశాంత్ కారుపైకి ఎక్కడంతో నుజ్జునుజ్జయ్యింది. అందులో చిక్కుకున్న ప్రశాంత్, శ్రావణిని పోలీసులు అరగంట పాటు తీవ్రంగా శ్రమించి క్రేన్ సహాయంతో బయటకు తీశారు. అప్పటికే శ్రావణి మృతిచెందగా, ప్రశాంత్ గాయాలతో బయటపడ్డాడు. ప్రశాంత్‌ను చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరకుని క్రేన్ సహాయంతో కార్లు, లారీని రోడ్డుకు పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. త్వరలో పెళ్లిపీటలు ఎక్కాల్సిన శ్రావణిని లారీ రూపంలో మృత్యువు కబళించడం చూపరులను కలచివేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నాగార్జునసాగర్ సీఐ బీసన్న తెలిపారు.



కారులో ఇరుక్కుపోయిన ప్రశాంత్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు



క్రేన్ సహాయంతో కార్లు, లారీని రోడ్డు పక్కకు తీయిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

లైన్‌మెన్‌పై దాడి.. కేసు నమోదు

చౌటుప్పల్: జూనియర్ విద్యుత్ లైన్‌మెన్‌పై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామానికి చెందిన గొడుగు యాదయ్య ఇంటి విద్యుత్ బిల్లు బకాయి ఉండడంతో జూనియర్ లైన్‌మెన్ రామాంజయ్య వెళ్లి బిల్లు చెల్లించమని అడిగాడు. దీంతో యాదయ్యతో పాటు అతడి కుమారుడు గణేష్ కలిసి జూనియర్ లైన్‌మెన్ రామాంజయ్యపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం

నల్లగొండ క్రైం: పట్టణంలోని హిందూపూర్‌లో బుధవారం వృద్ధురాలిపై ఓ వ్యక్తి అత్యాచారం చేశాడు. బాధితురాలు, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిందూపూర్ శ్మశానవాటిక సమీపంలో వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తుండగా.. కందుల కృష్ణ అలియాస్ కిట్టు ఆమెను శ్మశానవాటికలోకి బలవంతంగా లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని కృష్ణ వృద్ధురాలిని బెదిరించాడు. బాధితురాలు తన కుమార్తెతో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై గతంలో పలు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నల్లగొండ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌కు చెందిన నిజాంపట్నం ప్రవీణ్‌కుమార్(34) భార్య సౌమ్య నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తోంది. కొంతకాలంగా వీరు నల్లగొండ పట్టణంలోని పద్మానగర్ కాలనీ నివాసముంటున్నారు. ప్రవీణ్‌కుమార్ నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో పరమేశ్వర రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ప్రవీణ్‌కుమార్ నాలుగు రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ప్రవీణ్‌కుమార్ మృతిపై తమకెలాంటి అనుమానం లేదని అతడి కుటుంబ సభ్యులు నల్లగొండ టూటౌన్ పోలీసులకు తెలియజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని కిసాన్ నగర్‌లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు పట్టణ ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. మృతుడు కిసాన్‌నగర్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ ఉండేవాడని స్థానికులు పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 60సంవత్సరాలు ఉంటుందని, పసుపు, నీలంరంగు గీతల చొక్కా, బూడిద రంగు ప్యాంట్ ధరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి పేరు రాజేష్ అని తెలిసిందని, పూర్తి వివరాలు తెలియాల్సివుందని పేర్కొన్నారు.

పసికందు మృతిపై డీఎంహెచ్‌ఓ విచారణ



హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో విచారణ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో పసికందు మృతిచెందిన ఘటనపై బుధవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది, స్థానికులు, రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన చెప్పారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

రేవంత్‌రెడ్డి పాలన అభినందనీయం

- వర్రె వెంకటేశ్వర్లు



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న వర్రె వెంకటేశ్వర్లు, చిత్రంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : రాష్ట్రంలో పారదర్శక పాలన అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హైదరాబాదులోని సచివాలయంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసి అక్రమ కట్టడాలు కూల్చడం ప్రజాపాలనకు నిదర్శనం అన్నారు. టీజీపీఎస్సీలో భారీ ప్రక్షాళన చేసి అవినీతి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం, ఉద్యోగ క్యాలెండర్ ముందస్తుగానే ప్రకటించడం అభినందనీయం అన్నారు. అన్ని స్థాయిల్లో సమర్థత గల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నియమించి ప్రజలకు సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు.

టెక్నికల్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థికసాయం



మంత్రి కోమటిరెడ్డి చేతులమీదుగా ఆర్థికసాయం అందజేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు

నల్లగొండ: ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగులంతా కలిసి తమ వేతనాల నుంచి రూ.5లక్షలు విరాళాలు సేకరించి బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసం వద్ద ఆయన చేతుల మీదుగా సంజీవ్‌కుమార్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ్‌కుమార్ కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని మంత్రిని టెక్నికల్ అసిస్టెంట్లు కోరారు. అదేవిధంగా తమ పేస్కేల్ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ఈ నెల 21న సెక్రటేరియట్‌లో తనను కలవాలని వారికి సూచించారు. పేస్కేల్ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీఓ మాజీ అధ్యక్షుడు ఏడుదొడ్ల వెంకటరాంరెడ్డి, టీజీఓ మాజీ అధ్యక్షుడు గోన మోహన్‌రావు, ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లింగయ్య, కో–చైర్మన్ అంజిరెడ్డి, విజయకుమార్, వెంకటరామిరెడ్డి, నరసింహచారి, శ్రీనివాసరావు, జగన్, కృష్ణ, రేణుక పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం.. మహిళ సజీవ దహనం



వెంకటమ్మ (ఫైల్)

నాగారం: షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కావడంతో మహిళ సజీవ దహనమైంది. ఈ ఘటన నాగారం మండలం ఈటూరులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈటూరు గ్రామానికి చెందిన మహంకాళి వెంకటమ్మ (56) తన భర్త రాములుతో కలిసి రేకుల ఇంట్లో నివాసం ఉంటోంది. బుధవారం రాత్రి 7గంటల సమయంలో ఇంట్లోని స్విచ్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో రాములు కూరగాయలు తీసుకొచ్చేందుకు బయటకు వెళ్లగా వెంకటమ్మ ఇంట్లో నిద్రిస్తోంది. మంటలు ఎక్కువై మంచంపై ఉన్న దుప్పట్లకు అంటుకున్నాయి. ఈ మంటల్లో వెంకటమ్మ చిక్కుకుని సజీవ దహనమైంది. వెంకటమ్మకు మోకాళ్ల నొప్పుల కారణంగా నడవలేని స్థితిలో ఉండటంతో మంటలు వ్యాపించినప్పుడు మంచంలో నుంచి లేవలేకపోయినట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల వారు మంటలను గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి నీళ్లు చల్లి మంటలను ఆర్పేశారు. అప్పటికే వెంకటమ్మ మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరుగుతుంది



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

నేరేడుచర్ల: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూసారం మరింత అభివృద్ధి చెందుతుందని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త డి. నరేష్ అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండలం దాసారం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు క్రిమిసంహారక మందులు అధిక మోతాదులో వాడటం వలన నేల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. సేంద్రియ ఎరువులతో పండించే పంటలకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుందన్నారు. కేవీకేలో సేంద్రీయ వ్యవసాయంపై చేపడుతున్న వివిధ శిక్షణా కార్యక్రమాల గురించి రైతులకు వివరించారు. అనంతరం కేవీకే మృత్తికా శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ.. పంట వేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షల అనంతరం పంటకు అవసరమైనంత మోతాదులోనే ఎరువులను వాడుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు, సేంద్రియ ఎరువుల వాడకం, లాభాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ్, రైతులు గొండేటి రామయ్య, పాపయ్య, వెంకన్న, వెంకట్‌రెడ్డి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

బేకరీలో చోరీ

కోదాడ రూరల్: బేకరీలో ఓ దొంగ చోరీకి పాల్పడి రూ.6వేల నగదు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని నయానగర్‌కు చెందిన అక్కినపల్లి ఉపేందర్ బస్టాండ్ ఔట్‌గేట్ పక్కన బేకరీ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి బేకరీకి తాళం వేసి బుధవారం ఉదయం వచ్చి షాపు తీయగా షాపులోని సామగ్రి మొత్తం కిందపడి ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ.6వేల నగదు కనిపించలేదు. దొంగ షాపు పైన ఉన్న రేకులను తొలగించి లోనికి వచ్చాడు. బేకరీ లోపల సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగ తెలివిగా ముఖం కనపడకుండా జాగ్రత్తపడ్డాడు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఉపేందర్ ఫిర్యాదు మేరకు సీఐ రాము కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాడు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

రాజాపేట: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజాపేట మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం జరిగింది. బుధవారం రాజాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుపల్లి గ్రామానికి చెందిన బొంత నర్సింహులు(48) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య గతంలోనే మృతిచెందింది. అతడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. నర్సింహులు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉపేందర్ తెలిపారు. నర్సింహులు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగిక దాడి

భువనగిరి క్రైం: మానసిక దివ్యాంగురాలిపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి బంధువులు బుధవారం భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భువనగిరి మండలం చందుపట్లకు చెందిన మధు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్న మానసిక దివ్యాంగురాలికి మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. మంగళవారం మధ్యాహ్నం బాధితురాలి బంధువులు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి బాధితురాలికి తగిన న్యాయం చేయాలని సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ కోరారు.

రైలు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: రైలు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన పిన్నపురాళ్ల సమ్మయ్య(35) బుధవారం నాగిరెడ్డిపల్లి, టేకులసోమారం గ్రామాల మధ్యలో రైలు పట్టాలపై శవమై కనిపించాడు. అతడికి మతిస్థిమితం సరిగ్గా లేదని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు 30టన్నుల బియ్యం



బియ్యం లారీలను వరద ప్రాంతాలకు పంపిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు

- జెండా ఊపి లారీలను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడ : ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో వరద బాధితుల సహాయార్థం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ సేకరించిన 30టన్నుల బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి బుధవారం పంపించారు. మిర్యాలగూడ పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరైన రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి జెండా ఊపి లారీలను ప్రారంభించారు.

జమిలి ఎన్నికలపై ఏఐసీసీ నిర్ణయం తర్వాత మాట్లాడుతా..

జమిలీ ఎన్నికల నిర్వహణపై కేంద్ర కేబినేట్ తీర్మానం చేసిన విషయం టీవీల్లో చూశానని.. దీనిపై ఏఐసీసీ నిర్ణయం తర్వాత తాను మాట్లాడుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తాము అధికారంలోకి వస్తే గాంధీ భవన్‌కు తరలిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పడం సరికాదన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ గత లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోవాల్సిన పరిస్థితికి దిగజారిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి పది మాసాలు కాకుండానే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. అక్టోబర్‌లో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ కార్యదర్శి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఆరుగురు నిందితుల అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట డీఎస్పీ రవి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేటటౌన్: నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ఈ నెల 10న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఎనిమిది మందిని నిందితులుగా గుర్తించగా ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ రవి బుధవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన పత్తేపురం విజయ్‌కుమార్‌కు జనగామ జిల్లా దేవురుప్పల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన తన మేనమామ కుమార్తె సుమలతతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. గతంలో భూతగాదాల కేసులో విజయ్ జైలుకు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత కొన్నిరోజులకు సుమలత తండ్రి చనిపోగా ఆమె తన పుట్టింటికి వెళ్లింది. ఆ సమయంలో సుమలత ఇంట్లో ఉన్న బంగారు నగలు, స్టడీ సర్టిఫికెట్లు, భూమి పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకెళ్లగా అది గమనించిన విజయ్ ఆమెను నిలదీశాడు. దీంతో «నీతో ఉండటం ఇష్టం లేదు.. విడిపోతాను» అని విజయ్‌కు భార్య చెప్పింది. తన భార్యకు తిరుమలగిరికి చెందిన వనగండ్ల కిరణ్‌తో వివాహేతర సంబంధం ఉందని నిర్ధారించుకున్న విజయ్ ఎలాగైనా కిరణ్‌ను అంతమొందించాలని అనుకున్నాడు. విజయ్ తన తల్లిదండ్రులు యాదగిరి, ఎల్లమ్మ, సొంత బావ దుర్గం సైదులుతో సంప్రదించి మరో ఐదుగురితో కలిసి కిరణ్‌ను హత్య చేయడానికి పథకం రచించాడు. ఈ నెల 10వ తేదీన కిరణ్ తిరుమలగిరిలో తిరుమలహిల్స్ వద్ద బైక్‌పై వెళ్తుండగా విజయ్, అతడి తల్లిదండ్రులు, బావ, మరో ఐదుగురు కలిసి కిరణ్‌ను అడ్డగించి కారులో నాగారం మండలం డి.కొత్తపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వ కట్ట వద్దకు తీసుకెళ్లి కత్తులతో విచక్షణారహితంగా నరికి చంపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం బొప్పారం గ్రామం వద్ద నిందితులు పత్తేపురం విజయ్, వడ్డె పున్నం, దుర్గం సైదులు, ఎడ్ల చంద్రశేఖర్, మామిడి యల్లయ్య, దుర్గం బాబును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ యాదగిరి, ఎల్లమ్మ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి ఒక కారు, నాలుగు కత్తులు, నాలుగు బైక్‌లు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ కేసును ఛేదించిన నాగారం సీఐ ఇ. రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ అయిలయ్య, తిరుమలగిరి ఎస్‌ఐ సురేష్, ఏఎస్‌ఐ వెంకట్రాములును డీఎస్పీ అభినందించారు.

యాదాద్రీశుడి హుండీ ఆదాయం రూ.2.98కోట్లు



హుండీల్లోని కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి సమక్షంలో బుధవారం కొండ కింద గల సత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఆలయాధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో భాగంగా రూ.2,98,48,233 నగదు వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. నగదుతో పాటు మిశ్రమ బంగారం 205 గ్రాములు, మిశ్రమ వెండి ఐదు కిలోల 710 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ వచ్చినట్లు ఆయన తెలిపారు.

అవగాహనతో చదివితే లక్ష్యాన్ని చేరుకుంటారు



గరికపాటి నరసింహరావును సన్మానించిన కళాశాల పాలకవర్గం, అధ్యాపకులు

- ప్రవచనకర్త గరికపాటి నరసింహరావు

భువనగిరి: విద్యార్థులు అవగాహనతో చదివితే లక్ష్యాన్ని చేరుకుంటారని ప్రవచనకర్త గరికపాటి నరసింహరావు అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి డిగ్రీ కళాశాలలో యువతకు సన్మార్గ దర్శనం అనే అంశంపై ప్రేరణోపన్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవాలని అన్నారు. ఈర్ష్య, నిరుత్సాహం, అసంతృప్తి, అసహనం, సందేహాలతో గడపటం వంటివి విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగిస్తాయన్నారు. ఓర్పుతో ఎవరైతే నిత్యం సాధన చేస్తారో వారే లక్ష్యాన్ని చేరుకుంటారని అన్నారు. చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. జీవితా లక్ష్యాన్ని సాధించడం అనేది విద్యతోనే సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం ఆయనను కళాశాల పాలకవర్గ, అధ్యాపక బృందం సన్మానించారు. కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు వనం వీరేందర్, కార్యదర్శి టీఎస్ వంశీ తిలక్, వైస్ చైర్మన్ అనిల్ స్వరూప్ మిశ్రా, కోశాధికారి ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ గంజి రమేష్, అధ్యాపకులు డాక్టర్ బోడ జగన్నాథ్, పి. బాల్‌రెడ్డి, కిష్టయ్య, కనక బాలరాజు, పాండురంగం, శివప్రసాద్, సత్యనారాయణ, సిద్ధిరాములు, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి కేసులో జైలు శిక్ష



ఇటికాల వెంకన్న

అడ్డగూడూరు: కర్రతో బాలుడి ని కొట్టి గాయపరిచిన నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ రామన్నపేట కోర్టు జడ్జి చందన బుధవారం తీర్పు వెలువరించారు. అడ్డగూడూరు ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండల పరిధిలోని కొండంపేట గ్రామానికి చెందిన ఇటికాల వెంకన్న తన వదిన కుమారుడు పాలడుగు గణేష్‌ను 2018 సెప్టెంబర్‌లో మద్యం మత్తులో కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. పాలడుగు గణేష్ తాత ఎర్ర లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. కాగా బుధవారం రామన్నపేట కోర్టులో ఈ కేసు తుది విచారణకు రాగా.. జడ్జి చందన పలువురు సాక్ష్యులను విచారించి, సాక్ష్యాధారాలు పరిశీలించి వెంకన్నకి మూడేళ్ల జైలుశిక్షతో పాటు మూడు వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.